

# కేశవ

# అలక

ఫిబ్రవరి పంధొమ్మిది!

అంత తేలికగా మరుపొచ్చే దినమేమీ కాదు సురేష్‌కి.

మూడేళ్ళ క్రితం-సరిగ్గా ఈ రోజు-

ఆఫీసు మెట్లు దిగుతూ సన్నగా నవ్వుకున్నాడు. అనుకోకుండా నిట్టూర్చాడు అప్పుడే గడిచిపోయాయి-మూడేళ్ళు'?

రోడ్డు వెంట నడుస్తూంటే మనసంతా అదోలా తయారయింది. రోజూ చూసే జనసందోహం, అవే భవనాలు, ట్రాఫిక్కు, గందరగోళం!

గడియారంతో పందెం. ఇల్లు - ఆఫీసు. ఉదయం-సాయంత్రం. ఏమీ మారినట్టు లేదే-మరి-ఎలా గడిచిపోయాయి-మూడేళ్ళు!?

ఇల్లు దగ్గరవుతుండగా మనసంతా ఏదోలా అనిపించింది. హాయీ కాదు. బరువూ కాదు.

గుమ్మం వేపు చూశాడు-

అరచాటు తలుపు వెనుకనుంచి తనకోసం ఎదురుచూస్తూ-శ్యామల లేదు.

కొన్ని రోజులుగా (లేక - నెలలుగానా?-గుర్తులేదు!) శ్యామల సాయం

త్రాలు తనకోసం ఎదురుచూడటం లేదు.

ఆ సంగతి ఇన్ని రోజులూ పెద్దగా తట్టినట్టు లేదే తనకి? ఇవాళే - అదొక లోటుగా అనిపిస్తోంది!

ఫిబ్రవరి పంధొమ్మిది!

చెప్పులు గిరాటుగా మూలకి విసిరి బట్టలు మార్చుకుంటుంటే వొళ్ళు సారిగా చెప్పలేనంత నీరసమనిపించింది.

ఇంట్లోకొచ్చి ఇంత సేపవుతున్నా- శ్యామల కనిపించదు!

"వొచ్చారా!-"

అని రోజు రోజంతా ఎదురుచూసిన ఆర్ద్రతతో-ఆ పలకరింపు-ఏదీ?

"శ్యామలా!..."

జవాబు లేదు. బాత్‌రూం నుంచి చప్పుడు-బట్టలు మోదబడుతున్నాయి!

"శ్యామలా!..."

"ఆఁ!..."

అంతే. ఫిబ్రవరి పంధొమ్మిది! మూడేళ్ళు!

లుంగీ ఎగగట్టి బాత్‌రూంలో కెళ్ళాడు

బట్టలుతుకుతున్న శ్యామల స్వరూపం ఉల్లాసకరంగా ఏమీలేదు. చెదిరిపోయిన తల. అస్తవ్యస్తంగా చెక్కిన కుచ్చెళ్ళు. ముంజేతుల పైకి బిగుతుగా నొక్కి- చేర్చిన గాజులు. ముఖంలో అలసట.

"బట్టలుతుకుతున్నావా ?"

"కనిపించటంలా."

"వినిపించను గూడా వినిపించింది- పనిమనిషి రాలా ?"

"పై పన్లయితే చేస్తాగాని-బట్టలుత కటమ్మాత్రం నా వల్ల గాదమ్మా-అని నిన్న సాయంత్రమే కరాఖండిగా చెప్పేసిందది...రూపాయో రూపాయి న్నరో ఎక్కువిస్తానన్నా వొప్పుకోలా- బట్టలుతకటం బండపనిట - సరే - తప్పేదేముంది."

అరిగిన సోపుతోనే ముఖ ప్రక్షాళనం ముగించాడు

తను వొకవేపు ముఖం కడుక్కుం టుంటే-మరోవేపు-ఉతుకుతూనే ఉంది శ్యామల. బండమీంచి చెదిరి మురికి నీళ్ళు తనమీద పడుతున్నా - పట్టించు కోవటంలేదు.

బట్టలుతకటం-బండ పనే!

అద్దంముందు నిలుచుని ముఖం మరమ్మత్తు చేసుకున్నాడు - ఇంకా! జుత్తు పలచబడుతోందా ! ముక్కుకి అటూ ఇటూ నిలువుగీతలు బయలు దేరుతున్నాయా? బుగ్గలు వడిలిపోవటం మొదలయిందా? అప్పుడే!—

బట్టలారేసి వచ్చింది శ్యామల-పావు గంటకి.

"బాబుకి వొంట్లో బాగున్నట్టులేదు. మధ్యాహ్నమంతా అదోలా వున్నాడు- ఇందాకే పడుకున్నాడు"

గదిలోకెళ్ళి బాబును చూడాలని పించినా, వెళ్ళలేకపోయాడు. కుర్చీలో కూలబడ్డాడు.




'అద్భుతం' అనేప్పుడు - అతని కళ్ళలో మెరుపు—

నిజమే-

ఏరి కోరి కావాలనే ఏడిపించేవాడు సురేష్ తనని-తను అలిగేట్టు చేసేవాడు. అలకతీరిన తర్వాత ఆ దగ్గరతనంలో ఎంత హాయి...

తలుపు చప్పుడయింది. వెళ్ళి తలుపు తీసింది. నీరసంగా వొచ్చాడు సురేష్. సినిమాకు వెళ్ళినట్లు లేదు. ఎక్కడెక్కడో తిక్కతిక్కగా తిరిగొచ్చినట్టున్నాడు.

మౌనంగా లోపలికి దారితీసింది. కంచాలు సర్ది-వడ్డించింది.

మధ్య మధ్యలో పాత్రలూ గరిటలే మాట్లాడాయి.

ఇల్లు సర్ది తలుపులు మూసి వొచ్చేసరికి పక్క మీద వొత్తిగిలి పడుకున్నాడు సురేష్.

లైటు తీసేసి తటపటాయిస్తూ క్షణం నిలబడింది. బాబుదగ్గరి కెళ్ళి దుప్పటి సర్దింది. సురేష్ కదల్లేదు. పొడిగా దగ్గింది. వెళ్ళి అతనికి తగలకుండా పక్కనే కూచుంది. కొంతసేపటికి అతని చెయ్యి తగిలింది.

వెన్నెల—కిటికీ చువ్వలనుంచి శెలవు తీసుకునే వేళ - మెలకువ వొచ్చింది సురేష్‌కి

గుడ్డి వెల్తురులో శ్యామల కళ్ళు—దూరపు పడవలో దీపాల్లాగా మెరుస్తున్నాయి.

తలగడకి జేరగిలబడి-కిటికీ అవతలికి చూస్తోందామె.

"శ్యామలా-నిద్రపోలేదా?-"

"ఊఁ? ఊఁహూఁ...ఊఁ..."

"అదేంటి? కోపమొచ్చిందా? సాయంత్రం-"

ఆ సరికి శ్యామల మనసంతా తుపాను తర్వాత సముద్రంలా శాంతించింది. మౌనంగా అతడి చెంపను మునివేళ్ళతో రాసింది.

కోటి మాటలు చెప్పని అర్థం అందుకున్నట్టయిం దతనికి. పసిపిల్లాడిలా ఆమెను పొదువుకుంటూ – "సారీ! అయామ్ రియల్లీ సారీ...వెరీసారీ!..." అన్నాడు.

చాలా సేపటికి గొంతు విప్పింది శ్యామల–

"వొక్క మాటడగనా–"

"వూఁ..."

"ఏఁహీఁ అనుకోకూడదు–"

"అనుకోను–"

"మరి–పెళ్ళికి ముందూ–పెళ్ళయిన కొత్తలోనూ నువ్వేమనేవాడివో గుర్తుందా? ఊరికే అనటం కాదు-అలిగినప్పుడు నన్ను చూడాలని ఎంత ఉబలాట పడేవాడివి! కావాలనే నన్ను ఉడికించేవాడివి! ఏడిపించేవాడివి!-"

"శ్యామలా! స్టుపిడ్-సాయంత్రం నుంచీ ఇదే ఆలోచిస్తున్నావా?-"

"అవునూ-"

"సారీ-రియల్లీ వెరీసారీ - నీమీద విసుక్కుని అలా వెళ్ళిపోయాను చూడూ-పిచ్చెత్తినట్టు వూరంతా చెడ దిరిగాను-"

"తెలుసులే - అప్పుడప్పుడూ నీకు అలవాటేగా-"

"సారీ శ్యామలా! ... ఇకమీదట మనం వొకర్నొకరు ఇలా ఎప్పటికీ అపార్థం చేసుకోకూడదు-"

"ఊఁహూఁ..."

"తప్పు-మన ఇద్దరిదీ కాదు-"

"మరి-"

"నే కనుక్కున్న నిజం చెప్పనా-" ఆర్ద్రంగా ఆమె తల నిమురుతూ అన్నాడు-"నీలోనూ నాలోనూ మార్పు లేదు-మన ప్రేమ ఏమీ చెక్కుచెదర లేదు-కాని-నీ అలక-దాని సౌందర్యం-అది మాత్రం మారిపోయింది-మూడేళ్ళ క్రితం నీ అలక వెనక 'డబ్బు' ప్రసక్తి లేదు-ఇప్పుడు నీ అలక వెనక–'డబ్బు చాలకపోవటం' ఉంది..."

